## జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థుల సమావేశం

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం కళాశాలలో జరిగింది. మొదటి బ్యాచ్ 1965వ సంవత్సరం నుంచి ఇటీవల ఉత్తీర్ణులైన వారిలో మొత్తం 25మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ముందుగా వీసీ టీకేకే రెడ్డి వారితో సమావేశమై విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి కోర్సుల నిర్వహణకు సంబంధించి సహకారం అందించాలన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా త్వరలో బజాజ్ సంస్థవారు ల్యాబ్‌లను ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చేందుకు సాంకేతిక ఫ్యాకల్టీ అవసరం ఉంటుందన్నారు. వీరిని సమకూర్చాలని కోరారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి.నరసింహారెడ్డి, అలుమ్ని, యూనివర్సిటీ ఇండస్ట్రీ ఇంటరాక్షన్ సెంటర్(యూఐఐసీ) డైరెక్టర్లు డాక్టర్ పి.భ్రమర, డాక్టర్ అనిత షీల అలుమ్ని ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఏర్పాటు



పూర్వ విద్యార్థులతో ప్రిన్సిపల్ నరసింహారెడ్డి, అలుమ్ని డైరెక్టర్ భ్రమర, యూఐఐసీ డైరెక్టర్ అనితషీల తదితరులు

చేయనున్న ల్యాబులు, అందుకోసం అవసరమైన ఫ్యాకల్టీ వివరాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మెకానికల్, ఎలక్ట్రికల్, మెటలర్జీ, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్(ఈసీఈ) విభాగాల్లో ల్యాబులను అలుమ్ని ప్రతినిధులకు చూపించారు. ఫ్యాకల్టీ నియామకానికి తమ సహకారం అందిస్తామని వారు అంగీకరించారు. అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌మోహన్, ప్రతినిధులు సుబ్బారావు, వెంకటరమణ, వినయ్ కె.సూరి, నవీన్, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

## జేఎన్టీయూహెచ్ లో పూర్వ విద్యార్థుల సందర్శన..



నవతెలంగాణ-కేపీహెచ్ బీ

జేఎన్టీయూహెచ్ పరిధిలోని , యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ హైదరాబాద్ పూర్వ విద్యార్థుల (అలుమ్ని) బృందం శనివారం కళాశాలను సందర్శించి, వివిధ విభాగాల అభివృద్ధి కార్యక్రమాలు మరియు భవిష్యత్ ప్రణాళికలపై ఆరా తీశారు. మొదటి బ్యాచ్ నుంచి ఇటీవలే ఉత్తీర్ణులైన విద్యార్థుల వరకు మొత్తం 25 మంది సభ్యులతో కూడిన ఈ బృందం కళాశాలలోని మెకానికల్, మెటలర్జికల్, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాలను, వాటి ప్రయోగశాలలను సందర్శించి అధ్యాపకులతో ముచ్చటించింది. ఈ సందర్భంగా మెకానికల్ మరియు ఈఈఈ విభాగాల్లో 2026 నుంచి అమలు చేయనున్న పరిశ్రమ-ఆధారిత పాఠ్యప్రణాళిక పై పూర్వ విద్యార్థులు ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఇందులో భాగంగా ఏర్పాటు కానున్న 'బజాజ్ ఇంజనీరింగ్ & స్కిల్స్ ట్రైనింగ్ ల్యాబ్స్' గురించి అధ్యాపకుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. విభాగాల సందర్శనకు ముందు అలుమ్ని బృందం, జేఎన్టీయూహెచ్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ టి కిషన్ కుమార్ రెడ్డి ని కలిసి కళాశాల అభివృద్ధి, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల నైపుణ్యాల పెంపు వంటి అంశాలపై చర్చించింది. పరిశ్రమ-ఆధారిత పాఠ్యప్రణాళికలో భాగంగా శిక్షణ పొందనున్న కళాశాల సాంకేతిక సిబ్బందికి అవసరమైన మార్గదర్శకత్వం, మద్దతు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ సందర్శన కార్యక్రమాలను అలుమ్ని డైరెక్టర్ ప్రొఫెసర్ పి. భ్రమర ప్రణాళికాబద్ధంగా నిర్వహించగా, డాక్టర్ జీవీ నరసింహారెడ్డి మరియు వివిధ విభాగాధిపతులు సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ విజయ్ మోహన్‌తో పాటు 1970 మెకానికల్ బ్యాచ్‌కు చెందిన సుబ్బారావు, వెంకట రమణ, వినయ్ సూరి; 1979 బ్యాచ్‌కు చెందిన వి. నవీన్, సమ్మి రెడ్డి, అనంతరామ్; 2001 ఈసిఈ బ్యాచ్‌కు చెందిన శ్యామ్; 2020 మెటలర్జీ బ్యాచ్‌కు చెందిన రాజేందర్ లు పాల్గొన్నారు.

## రేపు పీజీఈసెట్, లాసెట్‌ల కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఈనాడు, హైదరాబాద్: పీజీఈసెట్, లాసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూళ్లు సోమవారం విడుదల కానున్నాయి. ఆ రెండు సెట్ల ప్రవేశాల కమిటీ సమావేశాలు రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్నారు. ఆ సందర్భంగా కౌన్సెలింగ్ షెడ్యూల్ జారీ చేస్తారు. పీజీఈసెట్‌లో తొలుత ఎంటెక్, ఎంఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికే కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. బీఫార్మసీ చివరి ఏడాది పరీక్షల ఫలితాలు ఇంకా వెలువడలేదు. దానికితోడు ఫార్మసీ కళాశాలలకు అనుమతి ఇచ్చేందుకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పీసీఐ)కు జులై 15వ తేదీ వరకు గడువుంది. దాంతో ఎంఫార్మసీ కౌన్సెలింగ్ తర్వాత జరుపుతారు. ఇక లాసెట్‌లో భాగంగా మొదట ఎల్ఎల్‌బీ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఎల్ఎల్‌బీ చివరి సంవత్సరం ఫలితాలు ఇంకా రానందున.. ఎల్ఎల్ఎం కౌన్సెలింగ్ తర్వాత జరపనున్నారు. ఇప్పటికే బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) నుంచి అధిక శాతం కళాశాలలకు అనుమతులు దక్కాయి.